సాక్షి బాపట్ల

మంగళవారం । 13 । జూన్ । 2023



ర్యాలీని ప్రారంభించిన జేసీ

గుంటూరువెస్ట్: కలెక్టరేట్ ఆవరణలో సోమవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీని జేసీ జి.రాజకుమారి జెండా ఊపి ప్రారంభించారు.



హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు

నగరంపాలెం(గుంటూరు): కాలువలు, పుష్కరఘాట్‌లు, చెరువులు, నీటిపారుదల ప్రదేశాల్లో పోలీస్ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ సోమవారం ఆదేశించారు.



జెన్‌కో ఎండీ పరిశీలన

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో నిర్మించిన 8వ యూనిట్‌ను ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్ బాబు సోమవారం పరిశీలించారు.

న్యూస్‌రీల్

ఎస్‌ఎస్‌జేసీ ఈఈ మురళీధర్ బాధ్యతల స్వీకారం




సత్తెనపల్లి: నాగార్జునసాగర్ జవహర్ కెనాల్ (ఎస్‌ఎస్‌జేసీ) సత్తెనపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎం.మురళీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేట మానిటరింగ్ డివిజన్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఈగా పనిచేసిన శ్యాంప్రసాద్ కృష్ణా డెల్టా సిస్టం డెప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా పదోన్నతి పొంది సోమవారం రిలీవ్ అయ్యాడు. మురళీధర్ మాట్లాడుతూ సత్తెనపల్లి డివిజన్ పరిధిలో నాగార్జునసాగర్ జవహర్ కెనాల్‌కు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రయత్నిస్తానన్నారు.

స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ

నరసరావుపేటఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోటప్పకొండలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ట్రెనింగ్ సెంటర్ స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ ప్లంబర్(జనరల్) కోర్సులలో రెండు నెలల నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్, ఐటీఐ విద్యార్హతలు గల నిరుద్యోగ యువత శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రెండు నెలల శిక్షణ అనంతరం పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వివరించారు. వివరాలకు సంస్థ సిబ్బంది ఎం.వీరాంజనేయులు (9160200652)ను సంప్రదించాలని తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.40 అడుగుల వద్ద ఉంది. ఇది 150.0070 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 450 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.30 అడుగుల వద్ద ఉంది. ఇది 33.9092 టీఎంసీలకు సమానం.

యార్డుకు 29,701 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,701 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 25,059 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళకు రూ.21,000 నుంచి 24,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.15,500 నుంచి రూ.24,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 4,642 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

దేశానికే ఆదర్శంగా మ్యూజియాల్లో సాంకేతికత అభివృద్ధి

సాక్షి, అమరావతి: దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ మ్యూజియాల్లో సాంకేతికను ప్రవేశపెట్టినట్టు పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ కమిషనర్ జి.వాణిమోహన్ తెలిపారు. 2022 బ్యాచ్‌కు చెందిన 10 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు విజయవాడలోని బాపూ మ్యూజియాన్ని సోమవారం సందర్శించారు. మ్యూజియంలోని ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటరాక్టివ్ డిస్ప్లే పనితీరుపై కమిషనర్ దగ్గరుండి ట్రైనీ ఐఏఎస్ అధికారులకు అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ప్రతి జిల్లాకు స్థానిక విలువలు, సంప్రదాయాలను తెలిపేలా మ్యూజియాలను అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు.



వస్త్రం వర్ధిల్లు : యూనిఫాం నాణ్యత చూస్తున్న సీఎం



షుక్రియ : షూను పరిశీలిస్తున్న దృశ్యం



బ్యాగ్‌బోన్ : విద్యార్థికి బ్యాగ్‌ను అందిస్తున్న సంక్షేమశీలి



కితాబిచ్చె : పాఠ్యపుస్తకాలపై ఆరా తీస్తున్న జననేత

నవరత్నమా నమామ్యహం

'విద్య'యుడా వందనం

- అట్టహాసంగా జగనన్న విద్యాకానుకల పంపిణీ
- పెదకూరపాడు నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాలు
- రూ.50 కోట్లతో ఎత్తిపోతల పథకం మంజూరు
- మాదిపాడు నుంచి పులిచింతల వరకు రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- 128 ఇళ్లకు ఆర్‌అండ్‌ఆర్ పూర్తిచేస్తామని ప్రకటన
- వైభవంగా కృష్ణానదిపై వంతెనకు శంకుస్థాపన
- అమరావతి–రాజుపాలెం రోడ్డు పనులకు శ్రీకారం
- ప్రజా సమస్యలు సావధానంగా విన్న సీఎం
- ఆపన్నులకు అండగా నిలిచిన వైనం
- పార్టీశ్రేణుల్లో ఉరకలెత్తిన ఉత్సాహం
- జనజయధ్వానాలతో మార్మోగిన క్రోసూరు

- పూర్తి వివరాలు 8లో.. ►

మండుటెండలో మంచుముత్యాలు కురిసినట్టు.. పెదకూరపాడు నియోజకవర్గం వరాల జల్లులో తడిసిముద్దయింది. అంబరాన వెలుగురేఖలేవో విరిసినట్టు.. విద్యార్థుల మోము కానుక కాంతులీనింది. సంబరాన హరివిల్లులు ముసిరినట్టు.. నవరత్న రేడు రాకతో క్రోసూరు సంతోషశోభితమైంది. చదువుల చంద'మామ' స్పర్శతో పుడమి పులకించినట్టు.. సంక్షేమ విజయ పతాక సగర్వంగా రెపరెపలాడింది. అమరావతి గుడిగంటలు లయబద్ధంగా మోగినట్టు జనగళం జగన్నినాదమై జయజయధ్వానాలు చేసింది. నవరత్నమా.. నమామ్యహం అంటూ కీర్తించింది.



విద్యాకానుక.. సంతోషాల వేడుక : విద్యాకానుకలు అందుకున్న విద్యార్థులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంలో మంత్రులు విడదల రజిని, అంబటి, కారుమూరి, బొత్స, ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కలెక్టర్ శివశంకర్

కార్యకర్తలకు అధిక సమయం

పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం

అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రోసూరు పర్యటన ముగించుకుని తిరిగి వెళ్లేటప్పుడు కార్యకర్తలను, నాయకులను కలిసేందుకు అధిక సమయం కేటాయించడంతో పార్టీశ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. తొలుత ఉదయం 9.29 గంటలకు హెలికాప్టర్‌లో క్రోసూరులో దిగిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వేలాది మంది ప్రజలు తనకోసం నిరీక్షిస్తుండడంతో నాయకులు, కార్యకర్తలతో 10 నిమిషాలే మాట్లాడారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలికి 9.40 గంటలకు బయలుదేరివెళ్లారు. సభ అనంతరం తిరిగి హెలిప్యాడ్ వద్దకు 12.40 గంటలకు చేరుకున్న సీఎం వైఎస్ జగన్ తన కోసం వేచిఉన్న నాయకులు, కార్యకర్తల దగ్గరకు వచ్చి పేరు పేరునా పలకరించారు. గంటా 37 నిమిషాలు వారి కోసం కేటాయించారు. వారు చెప్పేది సావధానంగా విన్నారు. దీంతో స్థానిక నేతలు ఆనందం వ్యక్తం చేశారు.



మామంచి సీఎం : విద్యార్థుల జయజయధ్వానాలు

సమష్టి కృషితో సీఎం సభ విజయవంతం

నరసరావుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో మండుటెండనూ లెక్కచేయకుండా బందోబస్తు విధులు నిర్వహించిన పోలీసులను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అభినందించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టంగా బందోబస్తు విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. సమష్టి కృషితోనే సీఎం పర్యటన జయప్రదమైందని పేర్కొన్నారు. సీఎంను గుంటూరు రేంజ్ ఐజీ పాల్‌రాజు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

బిల్లులిచ్చేశారు

- సోమవారం రూ.16 కోట్లు చెల్లించిన ప్రభుత్వం
- మిగిలిన రూ.7 కోట్లు రెండు రోజుల్లో..
- మొత్తం బిల్లు బకాయిలు రూ.23 కోట్లు
- సచివాలయాలు, రైతుభరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో పాటు అన్ని రకాల బిల్లులు క్లియర్
- ఆనందంలో కాంట్రాక్టర్లు



వార్డు సచివాలయ భవనం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వివిధ రకాల పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బిల్లులను సోమవారం ప్రభుత్వం చెల్లించింది. ఏజెన్సీలు, వ్యక్తుల పేర్లమీద చేసిన బిల్లుల మొత్తాన్ని కాంట్రాక్టర్ల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది. జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజులోనే రూ.16.35,08,547 మొత్తాన్ని చెల్లించడం గమనార్హం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులే కాకుండా 2009కి ముందు గత ప్రభుత్వంలో జరిగిన పనులకు సంబంధించి సుమారు రూ.10 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. వివిధ దశల్లో పనులు పూర్తి కానున్నాయి. జిల్లాలో ప్రభుత్వం సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, తదితర భవనాలకు, పాఠశాలల ప్రహరీలు, సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, పండ్ల తోటల పెంపకం, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు, మొక్కలు, నర్సరీలు, హార్టికల్చర్ విభాగాల్లో పనులు చేపట్టారు. వీటికి సంబంధించి ఏజెన్సీలతోపాటు వ్యక్తులకు సుమారు రూ.13 కోట్లు బిల్లులు చెల్లించాలి. ఇవి కాకుండా గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన బిల్లులు మరో రూ.10 కోట్లు కలిసి రూ.23 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం సోమవారం రూ.16.35,08,547 చెల్లించింది. ఇందులో ప్రయారిటీ పనులకు సంబంధించి రూ.10,33,25,734 నాన్ ప్రయారిటీ పనులకు సంబంధించి రూ.5,96,53,325 కాంట్రాక్టర్ల ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. ఈ పనులలో భాగంగా సిమెంట్ కంపెనీలకు రూ.5.29 లక్షలు మొత్తం చెల్లించింది. మిగిలిన సుమారు రూ.7 కోట్ల బిల్లులను మరో రెండు మూడు రోజులలో చెల్లించనున్నారు. ఒక్క రోజులోనే ప్రభుత్వం కోట్లాది రూపాయల బిల్లులు చెల్లించడం గతంలో ఎన్నడూ జరగలేదు. బిల్లులన్నీ దాదాపుగా క్లియర్ చేయడంతో వివిధ దశల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు మరింత వేగంగా జరగనున్నాయి.

రికార్డు స్థాయిలో బిల్లుల చెల్లింపు



ప్రభుత్వ హయాంలో చేసిన పనులకే కాకుండా గత ప్రభుత్వంలో చేసిన బిల్లులకు సైతం సోమవారం ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. ఒక్క రోజులో జిల్లాలో రూ.16 కోట్లకుపైగా బిల్లులు చెల్లించారు. మిగిలిన బిల్లులను వారంలోపు చెల్లించనుంది. వివిధ దశల్లో ఉన్న పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం.

– శంకరనాయక్, డ్వామా పీడీ

బడి గంటలు మోగే

నరసరావుపేట ఈస్ట్: బడి గంటలు మోగాయి. వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. చిన్నారులు బుడిబుడి అడుగులు వేసుకుంటూ బడిబాట పట్టారు. ఇంకా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఈనెల 17వరకు ఒంటిపూట తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం క్రోసూరులో 2023–24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించడంతో పాఠశాలల వారీగా మంగళవారం నుంచి జేవీకే కిట్లను విద్యార్థులకు అందించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,634 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 1,82,702 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందనున్నాయి. వీటిలో 1,163 ప్రాథమిక, 152 ప్రాథమికోన్నత, 246 ఉన్నత పాఠశాలతోపాటు 73 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాల స్థాయిని బట్టి ప్రతి కిట్‌లో మూడు జతల యూనిఫామ్, బెల్ట్, షూ, బ్యాగ్ తదితర తొమ్మిది రకాల వస్తువులు ఉంటాయి.



మున్సిపల్ బాలుర పాఠశాలలో ప్రవేశాల కోసం వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు.

అచెం'జల' సంకల్పం

- పట్టణాల్లో నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- బాపట్ల జిల్లాకు రూ.165.95 కోట్లు
- జిల్లా కేంద్రంలో ప్రారంభమైన పనులు



బాపట్లలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మంచినీటి పైపులైన్లు

బాపట్ల: ఎన్నో ఏళ్ల కిందట ఏర్పాటుచేసిన పైపులైన్లు...తుప్పుపట్టి నిత్యం లీకులు..తాగునీటి పైపులైన్లలో మురుగు వస్తోంది అంటూ కొందరు.. రెండు రోజులకు ఒకసారి వదులుతున్నారంటూ మరికొందరు..నిత్యం వదిలిన అరకొరగానే వస్తున్నాయంటూ ఇంకొందరు...ఇలాంటివి నిత్యం పట్టణ ప్రాంతాల్లో చూస్తుంటాం. వీటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బాపట్ల జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణతోపాటు నిరంతరం సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జలజీవన్‌మిషన్, అమృత్ 2.0, 15వ ఆర్థిక సంఘం నిధుల్లో బాపట్ల జిల్లాలోని బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి మున్సిపాల్టీల పరిధిలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.165.95కోట్లు మంజూరు చేశారు. ఎప్పటి నుంచో తుప్పు పట్టిన పైపులైన్లల్లో వచ్చే మురుగునీటి సరఫరాకు ముగింపు పలుకుతున్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గతంలో తాగునీటి సరఫరాపై దృష్టి సారించి ఐడీఎస్‌ఎంటీతో మున్సిపాల్టీ ఫిల్టర్‌బెడ్‌లు, పైపులైన్లు నిర్మాణం పూర్తి చేయించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

మున్సిపాలిటీల వారీగా తాగు నీటికి కేటాయించిన నిధులు ఇలా..

మున్సిపాలిటీ	రూ.కోట్లలో
బాపట్ల	22.95
అద్దంకి	85.00
చీరాల	23.00
రేపల్లె	35.00

స్థాయి పెంపుతో చీరాలకు పుష్కలం

చీరాల మున్సిపాల్టీలో అమృత్ 2.0 కింద రూ.23కోట్లకు ప్రతిపాదనలు పంపారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి ఓవర్ హెడ్ ట్యాంకు వరకు మంచి నీటి పైపులైన్ల కోసం నిధులు కేటాయించారు. ప్రస్తుతం 860ఎంఎల్‌డీ నీటి సరఫరా చేయగా ఈ నిధులతో 1470ఎంఎల్‌డీ నీటి సరఫరా చేసే విధంగా ప్రతిపాదనలు పంపారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి



తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నాం. 35 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్లతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అమృత్ 2.0తోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో తాగు నీటి సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టాం. 118 కిలోమీటర్ల మేరకు కొత్తగా పైపులైన్లు పనులు జరుగుతున్నాయి. ఈ పైపులైన్లు మరమ్మతులు పూర్తి చేసుకుంటే బాపట్ల మరో 30ఏళ్లపాటు నీటి ఎద్దడి లేకుండా పోతుంది.

–ఏ.భానుప్రతాప్, మున్సిపల్ కమిషనర్, బాపట్ల

మంచినీటి సరఫరాపైనే అధిక ప్రాధాన్యం



తాగునీటి సరఫరాపైనే అధిక ప్రాధాన్యం చూపుతున్నాం. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నాం. ఈ స్కీంలతో పూర్తిస్థాయిలో నీటి ఎద్దడికి పరిష్కారం లభిస్తుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా నీటి సరఫరాకు అత్యధిక నిధులు కేటాయించారు.

–కె.శ్రీనివాసరావు, డీఈ, బాపట్ల

తీరనున్న బాపట్ల వాసుల నీటి కష్టాలు

బాపట్ల మున్సిపాల్టీలో 35 ఏళ్ల కిందట ఏర్పాటుచేసిన పైపులైన్లతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ప్రస్తుతం 124 కిలోమీటర్లు మేర పైపులైన్లు ఉండగా వాటిలో 118 కిలోమీటర్లు మేర కొత్త పైపులైన్లు వేసేందుకు పనులు ప్రారంభించారు. ఈ మేరకు డ్రైవర్స్ కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకు, పైపులైన్లు నిర్మాణానికి అమృత్ 2.0తో పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘ నుంచి రూ.5.24కోట్లతో వెస్ట్ బాపట్ల, బేతనీకాలనీలో పైపులైన్లు, ప్యాడిసన్‌పేటలో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. ఉప్పరపాలెం ఓవర్ హెడ్‌ట్యాంకు నుంచి పైపులైన్ల నిర్మాణానికి రూ.90లక్షలు, నీటి శుద్ధి కేంద్రం కోసం రూ.1.80 కోట్లతో పైపులైన్లు ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టారు.



బాపట్లలోని మంచినీటి ఫిల్టర్‌బెడ్

అద్దంకికి గుండ్లకమ్మ వచ్చే..

అద్దంకి మున్సిపాల్టీలో జలజీవన్ మిషన్ నిధులు రూ.85కోట్లతో పనులు చేపట్టారు. ఈ పథకంతో గుండ్లకమ్మ నుంచి మెయిన్ పైపులైన్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. వీటితోపాటు మార్కెట్ యార్డు, ప్రకాశం జూనియర్ కళాశాల వద్ద, కాకానిపాలెం వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి చేసుకుంటే అద్దంకి పట్టణానికి పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా జరుగుతుంది. పనులు శరవేగంగా సాగుతున్నాయి.



అద్దంకిలో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్‌ట్యాంకు

లీకులకు చెక్

నిత్యం లీకులతో ఇబ్బందిపడుతున్న రేపల్లె పట్టణ ప్రజలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అమృత్ 2.0 నిధులు రూ.35కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకు, కొత్తపైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పనులు పూర్తయితే పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా జరుగుతుంది.



రేపల్లెలోని ఫిల్టర్‌బెడ్

లారీని ఢీకొన్న కారు, ముగ్గురికి తీవ్రగాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మేదరమెట్ల: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల జాతీయ రహదారి కొండ సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పేర్నమిట్ట గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి, మల్లీశ్వరి, జోషి ముగ్గురు కారులో పని నిమిత్తం వేరే ఊరు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. కారు మేదరమెట్ల జాతీయ రహదారి కొండ సమీపానికి రాగానే చెన్నైకు వెళ్లేందుకు రోడ్డు పక్కన నిలిపి ఉన్న మామిడికాయల లోడు లారీని బలంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగశివారెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో బెలూన్‌లు ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది.

నేడు జట్టు ఎంపిక

అద్దంకిరూరల్: తిరుపతిలో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగే నేషనల్ క్యాడెట్ జూడో చాంపియన్‌షిప్–2023, జులై 5 నుంచి 10 వరకు కర్ణాటకలోని తోరణగల్లు ఇన్‌స్పైర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో జరిగే నేషనల్ క్యాడెట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనటానికి బాపట్ల జిల్లా జూడో బాలబాలికల జట్టు ఎంపిక అద్దంకి ప్రభుత్వ బాలుర పాఠశాలలో మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా జూడో సంఘం కార్యదర్శి పి.రాంబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నవరత్నమా నమామ్యహం

సాక్షి ప్రతినిధి, గుంటూరు, క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాలు కురిపించారు. సోమవారం జగనన్న విద్యాకానుకల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు క్రోసూరు వచ్చిన ఆయన తొలుత మోడల్‌స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. వారితో పాటు కూర్చుని వారికి ఇచ్చిన పుస్తకాలను పరిశీలించారు. విద్యాబోధన, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత వారికి ఇచ్చిన ట్యాబ్‌తో సెల్ఫీ దిగారు. అనంతరం అంగరంగ వైభవంగా జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. పెదకూరపాడు నియోజకవర్గంపై వరాలు కురిపించారు. మాదిపాడు వద్ద రూ.60 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనివల్ల విజయవాడ, గుంటూరుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా హైదరాబాద్‌కు వెళ్లాలంటే 80 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అమరావతి – రాజుపాలెం మధ్య కీలకమైన రోడ్డు నిర్మాణం కోసం రూ.150 కోట్లతో శంకుస్థాపన చేశారు. నూతనంగా రూ.7.25 కోట్లతో నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.

వైఎస్సార్ స్వప్నం సాకారం చేశాం

అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పులిచింతల ప్రాజెక్టు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్వప్నమని, ఆయన పథకం మొత్తం పూర్తిచేస్తే మిగిలిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా 45 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం లేకుండా గత ప్రభుత్వం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.140 కోట్లు కేటాయించి, 45 టీఎంసీల నీళ్లు నింపి, ఆర్ అండ్ ఆర్ కార్యక్రమం కూడా పూర్తి చేశామని, వైఎస్సార్ స్వప్నం సాకారం చేశామని సగర్వంగా ప్రకటించారు. ఇంకా 128 ఇళ్లకు ఆర్ అండ్ ఆర్ ఇవ్వడం మిగిలిపోయిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తన


క్రోసూరులోని మోడల్ స్కూలు తరగతి గదిలో విద్యార్థులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

దృష్టికి తీసుకువచ్చారని, అది కూడా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. రూ.50 కోట్లతో అచ్చంపేట మండలం తాళ్లచెరువులో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మంజూరు చేస్తున్నట్టు ప్రజల కరతాళధ్వనుల మధ్య సీఎం ప్రకటించారు. స్థానికుల కోరిక మేరకు మాదిపాడులో ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి పులిచింతల వరకూ రూ. 3.50 కోట్లతో రోడ్డునూ మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. సబ్‌స్టేషన్ అవసరంపై అధికారుల నుంచి నివేదిక తీసుకున్న తర్వాత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సీఎంకు ధన్యవాదాలు

తొలుత పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ అమరావతి నుంచి బెల్లంకొండ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ.150 కోట్లతో అనుమతినిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అమరావతి నుంచి బెల్లంకొండ డబుల్ రోడ్డు, మాదిపాడు వద్ద కృష్ణానదిపై వంతెన కృష్ణమ్మకు మణిహారాల్లాంటివని అభివర్ణించారు. నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.258 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందని ఆనందం వ్యక్తం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇందులో నాలుగో వంతు లబ్ధి కూడా చేకూరలేదని గుర్తుచేశారు. వైద్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.24 కోట్లు విడుదల చేశారని వెల్లడించారు. వాటితో నియోజకవర్గంలో మూడు పీహెచ్‌సీల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు వివరించారు. 2009లో వైఎస్సార్ పాలిటెక్నిక్ కళాశాలకు అనుమతిస్తే గత పాలకులు కనీసం స్థలం సేకరించలేదని, మన ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థలం సేకరించి భవనం నిర్మించామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తొలి గెలుపు పెదకూరపాడు నుంచే మొదలవుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడిని ఇక్కడి ప్రజలు మెంటల్ చంద్రబాబు అని పిలుచుకుంటారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎద్దేవా చేశారు. గతంలో ఒక్క పైసా అభివృద్ధి పనులు చేయని చంద్రబాబుకు కేవలం తన కమారుడిని ముఖ్యమంత్రి చేసుకోవాలనే ఆపేక్ష తప్ప ప్రజలపై ప్రేమ లేదని స్పష్టం చేశారు. అందుకే ఆయన సభలకు ప్రజలు హాజరుకావటం లేదన్నారు. తాను గడపగడపకు వెళ్లినప్పుడు చంద్రబాబు రుణ మాఫీ బాండ్లను రైతులు చూపించారని పేర్కొన్నారు.

ప్రపంచస్థాయి విద్యే లక్ష్యంగా ప్రభుత్వం కృషి

కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి చదువేనని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి చదువును అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 1,80,089 మంది విద్యార్థులకు రూ.45 కోట్లతో విద్యాకానుక కిట్లు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను సీఎం జగన్ సావధానంగా విన్నారు. ఆపన్నులకు అండగా నిలిచారు. కార్యక్రమంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, అంబటి రాంబాబు, విడదల రజిని, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, జంగా కృష్ణమూర్తి, కె.ఎస్.లక్ష్మణరావు, కల్పలతా రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, సామినేని ఉదయభాను, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పి.కృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ లాల్‌పురం రాము, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, పలువురు కార్పొరేషన్ చైర్మను, డైరెక్టర్లు, విద్యాశాఖ అధికారులు ప్రవీణ్‌ప్రకాష్, సురేష్‌కుమార్, కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు తక్షణమే పరిష్కరించాలి

ఎస్పీ వకుల్ జిందాల్


బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 35 మంది బాధితులు ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి తమ సమస్య వివరించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయన్నారు. స్పందన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులు నిర్దిష్ట గడువులోపు పరిష్కరించి, ఫిర్యాదిదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలన్నారు. స్పందన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. స్పందన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డీసీఆర్‌బీ డీఎస్పీ జి.లక్ష్మయ్య, డీసీఆర్‌బీ సీఐ పి. బాలమురళీకృష్ణ, స్పందన సెల్ ఎస్ఐ హరిబాబు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలు సంపూర్ణంగా అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ వైద్య విధానం కార్యక్రమం క్షేత్రస్థాయిలో సంపూర్ణంగా అమలు చేయాలన్నారు. ఫాలోఅప్ ట్రీట్‌మెంట్ మిస్‌కాకుండా అందించాలన్నారు. సీడీఎస్‌సీడీ సర్వేలు వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా దీవెన క్విట్‌లు పంపిణీ వెంటనే ప్రారంభించాలని, దీంతోపాటు, పంపిణీ వివరాలు మండల స్థాయి అధికారులు ప్రతి రోజూ అప్‌లోడ్ చేయించాలని తెలిపారు. పాఠశాలల్లో జగనన్న గోరు ముద్ద పథకంలో రాగి జావ, మధ్యాహ్న భోజనం, నిర్దేశించిన సమయానికి అందించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాడు–నేడు అభివృద్ధి పనులు తక్షణమే పూర్తయ్యేలా ఎంఈఓలు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నా రు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బరువు తక్కువ, బలహీనంగా ఉన్న పిల్లలు ప్రతిరోజూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆహారం తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గుంటూరు రోడ్డులోని డాక్టర్ కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సారథ్యం శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల దాతలు రక్తదానం చేసి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి మురళి, సభ్యులు కేవీఎస్ఎన్ శ్రీనివాసగుప్తా, బత్తుల మురళి పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి


జగనన్న విద్యా కానుకను అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, జేసీ శ్రీధర్

- జగనన్న విద్యా కానుకను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: రాష్ట్రప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లోని స్పందన సమావేశం హాలులో జగనన్న విద్యా కనుక 4వ విడత పంపిణీ కార్యక్రమంలో భాగంగా కిట్స్‌ను ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, జాయింట్ కలెక్టర్ శ్రీధర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యాప్తి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు సైతం అధ్యయనం చేస్తున్నాయన్నారు. విద్యా కానుకను పాఠశాలలు ప్రారంభించిన రోజునే అందించి విద్యార్థులకు మీ మేనమామను నేనున్నాను...మీరు చదువుకోండంటూ భరోసా కల్పించారన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకుంటే పేదరికం పూర్తిగా నిర్మూలన చెందుతుందని భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షపార్టీలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాయని, త్వరలో జరిగే ఎన్నికల్లో వారికి సరైన గుణపాఠాన్ని ప్రజలే చెబుతారని పేర్కొన్నారు. జగనన్న విద్యా కానుకను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్.శ్రీధర్ అన్నారు. జిల్లాలో ఒక లక్షల 11వేల 22మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పథకం కింద కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూలు విద్యార్థులకు రూ.27.75కోట్ల ఖర్చుతో మూడు జతల యూనిఫాం, ఒక బ్యాగ్, ఒక బెల్ట్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్స్, నోట్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, టెస్టు బుక్స్, వర్క్ బుక్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే కిట్ ఒక్కటి రూ.2500 ఖరీదు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, డీఈఓ రామారావు, అధికారులు పాల్గొన్నారు.

మార్టూరులో దుకాణాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్ నాగజ్యోతి

మార్టూరు: వాణిజ్య పన్నుల శాఖల అధికారులు పలు దుకాణాలను తనిఖీ చేశారు. మండల కేంద్రం మార్టూరులోని నాలుగు దుకాణాలను వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ డీ నాగజ్యోతి తమ సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఇటీవల అడ్రస్ మార్పు కోసం, నూతనంగా లైసెన్స్‌లు పొందిన స్థానిక భాను ట్రేడర్స్, రజాక్ ట్రేడర్స్, లక్ష్మీ ఆటోమొబైల్స్, వరలక్ష్మీ వినాయక ట్రేడర్స్ షాపులను ఆమె పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో వాణిజ్య పనులు శాఖ సిబ్బంది, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు కౌన్సెలింగ్

బాపట్లఅర్బన్: బాపట్ల జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ఆగస్టు 2023 విద్యా సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకొన్న అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎన్.సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు వారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కాపీ, వెరిఫికేషన్ కాపీని,ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్(రెండు సెట్స్) హాజరు కావాలన్నారు. మెరిట్ ర్యాంక్ ప్రకారం ప్రభుత్వ ఐటీఐ నిజాంపట్నంలో హాజరుకావాలన్నారు. దరఖాస్తు చేసుకొన్న అర్హులైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ తేదీ, సమయాలను వారి మొబైల్ నంబర్లకు మెసేజ్ పంపామని తెలిపారు. వివరాలకు 9849479524 నంబరులో సంప్రదించాలన్నారు.

బాలకార్మిక వ్యవస్థపై అవగాహన అవసరం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు, ఆశలు

నరసరావుపేట: బాల కార్మిక వ్యవస్థ ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. చదవాలి, ఎదగాలి ఆడ పిల్లలు, అది చూసి మురవాలి తల్లిదండ్రులు అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలి

గుంటూరువెస్ట్: స్పందన అర్జీల పరిష్కారానికి తక్షణం కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు గుణాత్మకమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. అర్జీల పరిష్కారంపై ఉన్నతస్థాయి సమీక్ష ఉంటుందని చెప్పారు. సచివాలయ సిబ్బందికి మూడు జతల యూనిఫామ్ ఇచ్చామని, వాటిని తప్పక ధరించాలని సూచించారు.